క్లుప్తంగా

సిమెంట్ బల్లల ఏర్పాటు

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పలు చోట్ల కూర్చునేందుకు ఐదు సిమెంటు బల్లలను ఏర్పాటు చేశారు. ఈ బల్లలను పట్టణ మెడికల్ అసోసియేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జె.పంగులూరు: పంగులూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పంగులూరు గ్రామానికి బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ గొరంట్ల అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంగులూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో కొత్త విద్యుత్ లైన్లు పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన పది పరీక్షలు

బల్లికురవ: మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో గత నెల 17న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ 2 కె. రమేష్‌బాబు తెలిపారు. బల్లికురవ, వైదన, పెదఅంబడిపూడి పరీక్ష కేంద్రాల్లో 488 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా మూడు కేంద్రాల్లో ఒక్కోరు చొప్పున ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ వివరించారు.

ఇంటర్‌కు 7 నుంచి అడ్మిషన్లు

బల్లికురవ: బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఈనెల 7వ తేదీ నుంచి అడ్మిషన్లు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ కె. సుధాకర్ మంగళవారం తెలిపారు. రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించామని మొదటి సంవత్సరం సీఈసీ, బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో చేరే వారికి పదో తరగతి హాల్‌టిక్కెట్‌తో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. గత విద్యాసంవత్సరం నుంచి బల్లికురవ కళాశాలకు ఇంటర్‌బోర్డు పరీక్ష కేంద్రాన్ని మంజూరు చేసిందని తక్కువ ఖర్చు ఇంటి భోజనంతో మంచి ఫలితాలు సాధించేందుకు అడ్మిషన్లు పొందాలన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి గొట్టిపాటి

జె.పంగులూరు: రాష్ట్రంలో పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పంగులూరు మండలంలోని భగవాన్ రాజుపాలెం దళిత కాలనీలో మంగళవారం పెన్షన్లు పంపిణీ చేశారు. భగవాన్ రాజుపాలెంలో కొంత మంది దివ్యాంగులున్నారని, కొత్త పెన్షన్లు రావాల్సి ఉందని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్ళారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడుగా బంగారుబాబు



బంగారుబాబును అభినందిస్తున్న పార్టీ నాయకులు

అద్దంకి రూరల్: బాపట్ల జిల్లా భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడుగా అద్దంకికి చెందిన కొండముది బంగారుబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో పార్టీ అభివృద్ధికి పాటుపడతానన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు అభినందించారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం చైత్ర మాసం కృత్తిక నక్షత్రం చవితి తిధి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ధాన్యం.. రైతు దైన్యం



కారంచేడులో రైతులు ఏర్పాటు చేసుకున్న ధాన్యం పురులు



పండించిన పంటను ఇంటికి తరలించుకుంటున్న అన్నదాతలు

- ధాన్యం నిల్వలకు లేని గోదాములు
- కొనుగోలు కేంద్రాలూ లేని దుస్థితి
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఏటా ఇబ్బందులు పడుతూనే ఉన్న అన్నదాత

కారంచేడు: రైతే రాజ్యానికి వెన్నెముక.. రైతు లేనిది రాజ్యం లేదు. ఇలాంటి పదాలు చెప్పుకోవడానికి చాలా అందంగా, హుందాగా అనిపిస్తాయి. కానీ అన్నదాతలు చెమటోడ్చి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలుండవు. ధరలు వచ్చేంత వరకు దాచుకుందామనుకుంటే దాచుకోవడానికి జాగా ఉండదు. ఇది ఉమ్మడి ప్రకాశం జిల్లా ధాన్యాగారంగా పేరొందిన కారంచేడు ప్రాంత రైతన్నల దుస్థితి.

ఆధునిక పద్ధతులతో..

కారంచేడు ప్రాంతం వరి సాగుకు పెట్టింది పేరు. ఈ ప్రాంత రైతులు ఆధునిక పద్ధతులతో మంచి పంటలు పండిస్తారు. అధిక దిగుబడులు సాధించడంలో ఒకరికి మించి మరొకరు ఆధునిక పద్ధతులు అవలంబిస్తారు. జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలోనూ ఈ ప్రాంత రైతులకు మంచి గుర్తింపు ఉంది. ఎకరానికి సగటున 35 నుంచి 45 బస్తాలు దిగుబడులు సాధిస్తుంటారు. వాతావరణం అనుకూలించి సాగుకు నీరు సమృద్ధిగా ఉంటే 40 నుంచి 50 బస్తాల దిగుబడులు కూడా సాధించే రైతులున్నారు. కొమ్మమూరు కాలువ ఆయకట్టులో ఖరీఫ్, రబీ సీజన్లలో సుమారు 25 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తారు. సగటున 40 బస్తాల దిగుబడి చొప్పున 10 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడులు వస్తాయి.

గోదాములెక్కడ.. కొనుగోలు కేంద్రాలెక్కడ ?

జిల్లాలోనే అధిక దిగుబడులు సాధించే కారంచేడు ప్రాంతంలో ప్రభుత్వం నుంచి ఒక్క గోదాము కూడా లేకపోవడం శోచనీయం. సుమారు 8 లక్షల నుంచి 10 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడులు వచ్చే ప్రాంతంలో ప్రభుత్వం ఇంత వరకు తమ అభ్యున్నతి ఏమి చేసిందని ప్రశ్నిస్తున్నారు. ఏటా లక్షల క్వింటాళ్ల ధాన్యం కేవలం పురుల్లోనే దాచుకోవాల్సిన దుస్థితిలో ఉన్నామని రైతులు వాపోతున్నారు. ఎక్కువ మంది రైతుల ద్వారా, వ్యాపారుల ద్వారా ఏర్పాటు చేసిన ప్రైవేటు గోదాముల్లో నిల్వలు చేసుకోవాల్సి వస్తోంది. పురుల్లో ధాన్యం నిల్వ చేసుకోవాలంటే సాహసంతో కూడిన వ్యవహారం. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వేసవి కాలంలో జరిగే అగ్ని ప్రమాదాలు రైతుల ఆశలను బుగ్గిపాలు చేస్తుంటాయి. ఒక్కోసారి ప్రమాదాల్లో పురులు అగ్నికి ఆహుతైపోతుంటాయి. అమ్మకాలు చేసుకోవాలంటే దళారులను నమ్ముకోవాల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదాముల్లో భద్రపరచుకొనే వీలు లేకపోవడంతో పురుల్లో ధాన్యాన్ని స్టోర్ చేసుకోలేక అయినకాడికి అమ్మకాలు చేయాల్సి వస్తోంది. కారంచేడులో కాకుండా చుట్టుపక్కల గ్రామాలు, మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వలన అన్నదాతలకు పెద్దగా ఉపయోగం లేకుండాపోతోంది.

ప్రభుత్వ గోదాములు లేకపోవడంతో అవస్థలు



జిల్లాలోనే అత్యధికంగా వరి సాగు చేసే కారంచేడు మండలంలో ప్రభుత్వం గోదాములు ఏర్పాటు చేయాలి. గోదాములు లేకపోవడం వలన ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను పురుల్లో, బస్తాల్లో ఉంచి మెట్టలు కట్టుకోవాల్సి వస్తోంది. బస్తాల్లో ఉంటే ఎలుకలు.. పురుల్లో ఉంటే సరైన భద్రత లేకుండా పోతోంది.

– యార్లగడ్డ పాపారావు, రైతు, కారంచేడు

గిట్టుబాటు ధరలతో కొనుగోళ్లు కూడా కరువయ్యాయి..



కారంచేడు ప్రాంతంలో ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లలో కనీసం 8 నుంచి 10 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడులు వస్తాయి. అయినా ఈ ప్రాంతంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మంచి గిట్టుబాటు ధరలతో కొనుగోళ్లు మాత్రం చేయరు. దళారులను అరికట్టాలంటే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రైతులను ఆదుకోవాలి.

– యార్లగడ్డ శ్రీకాంత్, రైతు, కారంచేడు

చట్టాలపై అవగాహన ఉండాలి



మేదరమెట్లలో మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి ప్రియదర్శిని

మేదరమెట్ల: ప్రతి ఒక్క విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి ప్రియదర్శిని అన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమాన్ని కొరిశపాడు మండలం మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలపట్ల పూర్తి అవగాహన కలిగి ఉండటంతో పాటు చట్టాల్లో ఉండే హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. న్యాయవాదులు శ్రీనివాస్, ప్రకాష్, రమణయ్య, మహ్మద్ రఫీ, ఏఎస్ఐ అహ్మద్, హెచ్ఎం అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైవీని కలిసిన పర్చూరు నాయకులు



వైవీ సుబ్బారెడ్డితో పర్చూరు నాయకులు

చినగంజాం: రాజ్యసభ సభ్యుడు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని పర్చూరు నియోజకవర్గ నాయకులు మంగళవారం కలిసి పరామర్శించారు. ఒంగోలులోని ఆయన స్వగృహంలో కలిసి సుబ్బారెడ్డి తల్లి యర్రం పిచ్చమ్మ మృతి పట్ల వారు సానుభూతి వ్యక్తం చేశారు. ఇంకొల్లు మాజీ జెడ్పీటీసీ, ఎంపీపీ భవనం శ్రీనివాసరెడ్డి, చినగంజాం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి, మాజీ వైస్ ప్రెసిడెంట్ బక్కా వెంకటేశ్వరరెడ్డి, కోట సుబ్బరామిరెడ్డి, ఇంకొల్లు పార్టీ నాయకులు హరి రామిరెడ్డి, అంకిరెడ్డి, ప్రభాకరరెడ్డి, హేమంత్ కుమార్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి, పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీ.. మహిళకు గాయాలు

అద్దంకి రూరల్: రోడ్డు పక్కన నడుస్తున్న మహిళను గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొని గాయాలైన సంఘటన సోమవారం రాత్రి అద్దంకిలో చోటుచేసుకుంది. అద్దంకికి చెందిన టి. పద్మ అద్దంకి – నార్కెట్‌పల్లి నామ్ రహదారి అద్దంకి పట్టణంలోని సూర్య రెస్టారెంట్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వస్తూ ఢీకొట్టాడు. స్థానికులు 108 ద్వారా అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతోంది.

ముప్పాళ్లలో నేత్రదానం



దాత చిన్న కోటేశ్వరరావు (ఫైల్)

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని ముప్పాళ్ల గ్రామానికి చెందిన చిన్నకోటేశ్వరరావు(72) మంగళవారం మృతి చెందడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఇంకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శంకర కంటి వైద్యశాల వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. దాత భార్య రంగమ్మ, కుమార్తెలు సునీత,మాధవి, పావని, కుమారుడు విజయ్, వదిన ఇందిరమ్మలను అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్‌కే రఫి, చుండి సాంబశివరావు, రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ సభ్యులు వారి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



ర్యాలీగా వస్తున్న మున్సిపల్ కార్మికులు

చీమకుర్తి: ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం చీమకుర్తిలోని సీఐటీయూ నాయకులు పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో చీమకుర్తి మున్సిపల్ కార్మికులు అంబేడ్కర్ నగర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి తమ నిరసనలను తెలిపారు. సమ్మె ఒప్పందంలో భాగంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తే కార్మికులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్‌ల సంఘం నాయకులు ఏడుకొండలు, పద్మ, కోటేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు మరమ్మతులు



రోడ్డు మరమ్మతులను పర్యవేక్షిస్తున్న ఎస్సై

సంతనూతలపాడు: జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు సంతనూతలపాడు మండలంలో ఆర్అండ్‌బీ రహదారి గల స్పీడ్ బ్రేకర్లు వద్ద మరమ్మతుల కార్యక్రమం చేపట్టారు. ఇటీవల పోలీస్ స్టేషన్ తనిఖీ నిమిత్తం వచ్చిన ఎస్పీ దామోదర్ దెబ్బతిన్న రహదారులను పరిశీలించి ప్రమాదాల నివారణకు మరమ్మతులు చేయాలని ఎస్సై అజయ్ బాబును ఆదేశించారు. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో ఎస్సై స్వచ్ఛందంగా ప్రమాదాల నివారణకు మంగళవారం ఎండ్లూరు డొంక వంతెన ప్రాంతంలో దెబ్బతిన్న రహదారిని సిబ్బందితో మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దేవస్థానానికి రూ. 50,116 విరాళం



అభయాంజనేయ స్వామి దేవస్థానానికి విరాళం అందజేస్తున్న దాతలు

పర్చూరు(చినగంజాం): మండలంలోని పర్చూరు అభయాంజనేయ స్వామి దేవస్థానానికి దాతలు రూ. 50,116 విరాళంగా అందజేశారు. కొల్లావారిపాలెం గ్రామానికి చెందిన రోటరీ సీనియర్ సభ్యులు, సాయిబాబా దేవస్థాన కమిటీ సభ్యులు నాగుబడి సుబ్బారావు భార్య లలిత కుమారి మంగళవారం కమిటీ సభ్యులకు అందజేశారు. దాతలను సన్మానించారు. సభ్యులు కోట హరిప్రసాద్, రంగిశెట్టి రామాంజనేయులు, కటారి సురేంద్రబాబు, తులసి శివనాగేశ్వరరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, కాకుల వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



ప్రతిష్ఠించనున్న దేవతామూర్తుల విగ్రహాలు

చీరాల అర్బన్: పట్టణంలోని ఉజిలిపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. త్రయాహ్నిక దీక్షతో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం విఘ్నేశ్వరపూజ, వేద పారాయణ, అగ్నిప్రతిష్ఠాపన, అభ్యంగనస్నానం, వాస్తు పూజ కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మందిర కమిటీ ప్రతినిధులు తెలిపారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. యనమండ్ర శేషగిరి శర్మ బృందంచే నిర్వహిస్తున్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంపిక



స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాలు

జె.పంగులూరు: మండల పరిధిలోని కొండమంజులూరు గ్రామంలో గల రావుల జానకిరామయ్య పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాలుగా మంగళవారం ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇమ్మిడిశెట్టి అనిత మంగళవారం తెలిపారు. బాలుర స్కౌట్ బృందానికి స్టెల్లార్ స్కౌట్ యూనిట్‌గా, బాలికల స్కౌట్ బృందానికి ఎలైట్ గైడ్స్ కంపెనీగా నామకరణం చేసినట్లు తెలిపారు. యూనిట్ హెడ్ కెప్టన్‌గా క్రాఫ్ట్ ఉపాధ్యాయిని ఎన్. అనురాధ వ్యవహరిస్తారని చెప్పారు. స్కౌట్ బృంద సభ్యులు రాబోవు కాలంలో అవసమైన సందర్భాల్లో సమాజానికి వారి సేవలను అందిస్తూ సేవా భావాన్ని సమాజంలో పెంపొందించడంలో కృషి చేస్తారని చెప్పారు.

పురాతన భవనంలోనే పీహెచ్‌సీ



అద్దంకిలో పురాతన పీహెచ్‌సీ కార్యాలయం

అద్దంకి రూరల్: సుమారు 150 సంవత్సరాల క్రితం నిర్మించిన పురాతన భవంతిలో నేటికి అద్దంకి పీహెచ్ సిబ్బంది కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఎప్పుడు కూలుతుందో అని భయందోళనలతో సిబ్బంది ఉన్నారు. ఈ భవనం 1875లో నిర్మించారు. దీనికి రెండు వైపులా ఇన్‌పుట్ పేషెంట్, అవుట్‌పుట్ పేషెంట్ విభాగాలకు బల్డింగ్‌లున్నాయి. ఈ పురాతన భవనంలో పీహెచ్‌సీ పరిధిలోని సిబ్బంది, విలువైన కంప్యూటర్లు, టీకాలు నిలువచేసే ఫ్రిజ్‌లున్నాయి. అయితే చిన్నవర్షం కురిసిన వాటిపై పరదాలు, పట్టలు కప్పాల్సిందే. ఒక వైపు గదిలో 108 సిబ్బంది నిత్యం ఎలుకలతో పోరాటం చేస్తూ ఉంటారు. ఇది మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కూటమి సర్కార్ పట్టించుకుని, పూర్తిగా కూలకముందు, ఏ ప్రమాదం జరగక ముందే నూతన భవనం నిర్మించాలని సిబ్బంది కోరుతున్నారు.

బహుజన జేఏసీ చైర్మన్‌కు వినతి పత్రం అందజేత



బహుజన జేఏసీ చైర్మన్‌ను కలిసిన ఐక్యవేదిక నాయకులు

అద్దంకి రూరల్: దళిత బహుజనుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు సోమవారం విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో బహుజన జేఏసీ చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. పలు సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అదనపు గదులకు ప్రతిపాదనలు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అవసరమైన అదనపు గదుల నిర్మాణం కోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేశామని కారంచేడు జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దశాబ్దాల క్రితం గ్రామంలోని దాతల సహకారంతో నిర్మాణం చేపట్టిన ఈ ఆసుపత్రిలో ఎన్నోసార్లు మరమ్మతులు చేపట్టారన్నారు. ప్రస్తుతం వైద్యశాలలో ఇద్దరు వైద్యులు ఉండటం వలన మరొక వైద్యుని వైద్యునికి అవసరమైన గదితో పాటు, ల్యాబ్ టెక్నీషిన్ కోసం (పరీక్షల గది) మరొక గది అవసరమని స్థానిక వైద్యుల నుంచి వచ్చిన విజ్ఞప్తిని పరిశీలించామన్నారు. గదుల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలను మండల ఇంజినీరుతో సిద్ధం చేయించామన్నారు. గదుల నిర్మాణాలకు రూ. 23లక్షలతో ప్రతిపాదనలు తయారు చేశామని, వీటిని ఉమ్మడి ప్రకాశం జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ అయిన బూచేపల్లి వెంకాయమ్మకు అందజేశామని తెలిపారు. ప్రతిపాదనలు పరిశీలించిన చైర్‌పర్సన్ నిధులు విడుదలకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

వసంత నవరాత్రులతో శుభాలు



శ్రీనివాసులు సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు, అర్చకులు

ఒంగోలు మెట్రో: వసంత నవరాత్రుల్లో పూజలు చేయడం వలన సమస్త శుభాలు కలుగుతాయని ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఒంగోలు సంతపేట సాయిబాబా మందిరంలో వసంత నవరాత్రి మహోత్సవాలు భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి. ఈసందర్భంగా ఆయన వసంత నవరాత్రి వైభవంపై మాట్లాడుతూ ఉగాది ప్రారంభంలోనే అమ్మవారిని ప్రకృతి స్వరూపిణిగా భావించి అమ్మవారి ఆరాధన చేయడం వల్ల సమస్త శుభాలు కలుగుతాయన్నారు. దేవి శరన్నవరాత్రి మహోత్సవాల లాగానే తొమ్మిది రోజులు అమ్మవారిని వివిధ రూపాల్లో ప్రతిష్ఠించి అమ్మని వసంత నవరాత్రుల్లో కూడా ఆరాధన చేయాలని కోరారు. ముందుగా మందిరం అధ్యక్షుడు అళహరి చెంచలరావు, సెక్రటరీ కృష్ణమోహన్, ఓరుగంటి ప్రసాద్, శ్రీనివాసులును సత్కరించారు. కార్యక్రమంలో సుధాకర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.